

అస్తికోసం అంతమొందించాడు

హత్యకుగురై కొండపోచమ్మ సాగర్‌లో శవమై తేలిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. ఆస్తికోసమే హత్య జరిగినట్లు సీపీ శ్వేత తెలిపారు. 8లో..



తల్లి కొడుతోందని..

మతిస్థిమితం లేని తల్లి తరచూ కొడుతుండటంతో భరించలేని ఇద్దరు బాలికలు ఇంటి నుంచి బయటికి వెళ్తుండగా.. ఉపాధి హామీ కూలీలు గమనించి చేరదీశారు. 8లో..



ఇక నుంచి మీరే హక్కుదారులు

చిన్నకోడూర్ మండలంలో అసైన్డ్ భూములకు సంబంధించి 119మందికి ఆర్థిక మంత్రి హరీశ్‌రావు పట్టాలు పంపిణీ చేశారు. 9లో..

న్యూస్‌రీల్

ఉత్తమ ఫలితాలకు కృషి చేయాలి



ఉపాధ్యాయులతో మాట్లాడుతున్న డీఈఓ

చిన్నకోడూరు(సిద్దిపేట): ఉపాధ్యాయులు బోధనోపకరణాల సాయంతో విద్యార్థులకు పాఠాలు బోధించి ఉత్తమ ఫలితాలు సాధించేలా కృషి చేయాలని డీఈఓ శ్రీనివాస్‌రెడ్డి సూచించారు. శుక్రవారం మండల పరిధిలోని గోనెపల్లి ఉన్నత పాఠశాలను ఆయన సందర్శించారు. విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల సామర్థ్యాలను పరీక్షించారు. పట్టుదలతో చదివి మంచి ఫలితాలు సాధించాలన్నారు. ఆయన వెంట ఎంఈఓ దేశిరెడ్డి ఉన్నారు.

హాథ్‌సే హాథ్ జోడో యాత్ర చరిత్రలో నిలుస్తుంది



జోడో యాత్రలో పొన్నాల లక్ష్మయ్య

మద్దూరు(హుస్నాబాద్): హాథ్‌సేహాథ్ జోడో యాత్ర చరిత్రలో నిలుస్తుందని పీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్య అన్నారు. శుక్రవారం లద్నూరు గ్రామంలో హాథ్‌సేహాథ్ జోడో యాత్ర ప్రారంభించి మద్దూరు, గాగిళ్లాపూర్, రేబర్తి, వంగపల్లి గ్రామాల్లో కొనసాగించారు. ఈ సందర్భంగా పొన్నాల మాట్లాడుతూ దేశ స్వాతంత్ర్యం కోసం కాంగ్రెస్ పార్టీ పోరాడిందని, అదే విధంగా రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర నిర్వహించారన్నారు. వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో ప్రజలే బీఆర్‌ఎస్‌కు తగ్గిన గుణపాఠం చెప్పి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తారన్నారు. ఈ కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి, జెడ్పీటీసీ సభ్యుడు గిరి కొండల్‌రెడ్డి, మండల అధ్యక్షుడు బండి శ్రీనివాస్‌గౌడ్, చెట్కూరి కమాలకర్‌యాదవ్, కూకట్ల బాలరాజు యాదవ్, దాసరి రఘువీరపద్మారెడ్డి, రవి తదితరులు పాల్గొన్నారు.

రంగనాయకసాగర్ నిర్మాణం అద్భుతం



రిజర్వాయర్ వద్ద రాజస్థాన్ బృందం

చిన్నకోడూరు(సిద్దిపేట): మండల పరిధిలోని రంగనాయకసాగర్ రిజర్వాయర్‌ను శుక్రవారం రాజస్థాన్‌కు చెందిన ఇరిగేషన్‌శాఖ అధికారుల బృందం సందర్శించింది. సర్జిపుల్ పంప్ హౌస్, బండ్, రిజర్వాయర్ మధ్యలోని గెస్టు హౌస్‌ను పరిశీలించారు. రిజర్వాయర్ నిర్మాణం అద్భుతంగా ఉందని కితాబిచ్చారు.

మల్లన్న సాగర్ కూడా...

తొగుట(దుబ్బాక): కొమురవెల్లి మల్లన్న సాగర్‌ను కూడా రాజస్థాన్ బృందం సందర్శించింది. ఈఎన్‌సీ హరిరామ్ ప్రాజెక్టు గురించి వారికి వివరించారు. ఈఈలు వెంకటేశ్వర్‌రావు, సాయిబాబ తదితరులు పాల్గొన్నారు.

గౌరవెల్లి నిర్వాసితులకు పునరావాస చెక్కుల పంపిణీ



చెక్కు అందజేస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి

అక్కన్నపేట(హుస్నాబాద్): గౌరవెల్లి ప్రాజెక్టు కింద ముంపునకు గురవుతున్న ఐదు తండాల గిరిజన భూనిర్వాసితులకు ప్రత్యేక పునరావాస ప్యాకేజీ చెక్కులను జిల్లా అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి పంపిణీ చేశారు. శుక్రవారం హుస్నాబాద్‌లోని ఆర్డీఓ కార్యాలయంలో 75మందికి చెక్కులు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టప్రకారంగా భూనిర్వాసితులకు రావాల్సిన పరిహారాన్ని అందజేస్తున్నామన్నారు. వారి త్యాగాలు వెలకట్టలేమన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సంజీవ్‌కుమార్ జెడ్పీటీసీ మాజీసభ్యుడు మాలోతు భీలునాయక్, కుందనవానిపల్లి ఉప సర్పంచ్ మాలోతు నరసింహనాయక్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త పంచాయతీల్లో పరేషన్

- రేషన్ దుకాణాల ఏర్పాటు మరిచిన ప్రభుత్వం
- ప్రతినెలా 3 నుంచి 5 కిలోమీటర్లు వెళుతున్న లబ్ధిదారులు
- జిల్లాలో కొత్తగా ఏర్పాటైన పంచాయతీలు 100

గ్రామ పంచాయతీల సంఖ్య:	రేషన్‌షాపులు:
499	684
ఫుడ్‌సెక్యూరిటీ కార్డులు: 2,72,886	
అన్నపూర్ణ పథకం కింద:	అంత్యోదయ కార్డులు:
84	18,623



రేషన్ షాపు వద్ద బియ్యం తీసుకుంటున్న లబ్ధిదారులు (ఫైల్)

సిద్దిపేటఅర్బన్: కొత్తగా ఏర్పడిన గ్రామపంచాయతీల్లో రేషన్‌షాపులు ఏర్పాటు చేయలేదు. దీంతో లబ్ధిదారులకు ఇబ్బందులు తప్పడం లేదు. పాలన, సేవలు చేరువ చేయడం, పథకాలఅమలు మరింత సులభతరం చేసేందుకే కొత్త పంచాయతీలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. అయితే పాత పంచాయతీల పరిధిలోని రేషన్ దుకాణాల నుంచే కొత్త పంచాయతీల పరిధిలోని లబ్ధిదారులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్నారు. దీంతో ప్రతినెలా బియ్యం అక్కడకే వెళ్లి తీసుకోవాల్సి వస్తోంది. ఇలా 100 పంచాయతీల పరిధిలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

- 2018 డిసెంబర్‌లో నూతన గ్రామ పంచాయతీలు ఏర్పాటు కాగా, 2019 ఫిబ్రవరిలో పాలన ప్రారంభమైంది.
- మూడు సంవత్సరాల క్రితం 500 రేషన్‌కార్డులకు ఒక రేషన్‌షాపు ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. అయినా ఆ ప్రక్రియ ఇంత వరకు ముందుకు సాగలేదు.
- పాత పంచాయతీ పరిధిలోని ఆవాస ప్రాంతాల నుంచి ప్రతి నెలా సరుకులు తీసుకువెళ్లడానికి లబ్ధిదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.
- 3 నుంచి 5 కిలోమీటర్ల దూరం ఉన్న షాపులకు వెళ్లి ప్రతినెలా బియ్యం మోసుకురావడానికి వ్యయప్రయాసలకు లోనవుతున్నారు.
- రేషన్‌షాపుల కోసం గ్రామ పంచాయతీ నుంచి విజ్ఞప్తులు వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ఆయా గ్రామాల సర్పంచ్‌లు ఆరోపిస్తున్నారు.

కొత్త పంచాయతీ ఏర్పడినా ప్రయోజనం లేదు

మా గ్రామ పంచాయతీ ఏర్పాటై నాలుగు సంవత్సరాలు గడుస్తోంది. బియ్యం కోసం పాత గ్రామ పంచాయతీ అయిన మిట్టపల్లికి వెళ్లాల్సి వస్తోంది. ముసలివారు అనేక ఇబ్బందులు పడుతున్నారు. మా గ్రామంలోనే రేషన్ ఏర్పాటు చేయాలి.

– నారాయణ, బొగ్గులోనిబండ

విజ్ఞప్తులు వస్తే ప్రతిపాదనలు పంపిస్తాం



కొత్త గ్రామాల్లో రేషన్ షాపులు ఏర్పాటు చేయాలని గ్రామ పంచాయతీల నుంచి తీర్మానం చేసి ప్రతిపాదనలు పంపిస్తే ప్రభుత్వానికి నివేదిక పంపిస్తాం. తదుపరి ప్రభుత్వ ఆదేశాల మేరకు కొత్త షాపులను ఏర్పాటు చేసే ప్రక్రియ చేపడతాం.

– హరీశ్, జిల్లా పౌరసరఫరాల అధికారి

డబుల్ ఇళ్ల తుది జాబితా విడుదల



మంజులను కాపాడిన స్థానికులు

గజ్వేల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలో ఎట్టకేలకు డబుల్ బెడ్రూమ్ ఇళ్ల తుది జాబితాను అధికారులు విడుదల చేశారు. 3518 దరఖాస్తులు రాగా ఇందులో 1118 మందిని ఎంపిక చేసినట్టు గతనెల 3వ తేదీన ప్రకటించారు. దీనిపై అభ్యంతరాలు రావడంతో మరోసారి విచారణ జరిపారు. శుక్రవారం 1389మంది పేర్లతో జాబితా విడుదల చేశారు. ఈ జాబితాను మున్సిపల్, తహసీల్దార్ కార్యాలయాల వద్ద గోడలకు అతికించారు. అయితే డబుల్ బెడ్రూమ్ మోడల్ కాలనీలో ప్రస్తుతం 1100కుపైగా ఇళ్లు అందుబాటులో ఉండగా..తుది జాబితా లబ్ధిదారుల సంఖ్య 1389గా ఉండటంతో లక్కీ డ్రా ద్వారా ఈ నెల 6న పట్టణంలోని మహతి ఆడిటోరియంలో ఎంపిక చేస్తామన్నారు. ఈ జాబితాలోనూ పేరులేనివారు మంత్రి హరీశ్‌రావును కలవడానికి ప్రయత్నించారు. ఈ క్రమంలోనే టీఎస్‌ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి వారితో ప్రత్యేకంగా మాట్లాడారు. జాబితాలో పేరులేని పేదలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ఈ అంశాన్ని తానూ మంత్రి హరీశ్‌రావు దృష్టికి తీసుకెళ్లి నిజమైన లబ్ధిదారులకు న్యాయం జరిగేలా చూస్తామని హామీ ఇచ్చారు. దీంతో పేదలంతా అక్కడి నుంచి వెళ్లిపోయారు. ప్రతాప్‌రెడ్డి వెంట మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, వైస్ చైర్మన్ జకీయొద్దీన్‌లు ఉన్నారు.

జాబితాలో పేరు లేదని..

అధికారులు ప్రకటించిన డబుల్ బెడ్‌రూమ్ ఇళ్ల తుది జాబితాలో తన పేరు లేదని మనస్తాపానికి లోనైన ఓ మహిళ శుక్రవారం రాత్రి ఆత్మహత్యాయత్నం చేసింది. భర్త మరణించడంతో తన కూతురితో కలిసి పాయిల మంజుల పట్టణంలోని 10వ వార్డులోని బంధువుల ఇంట్లో అద్దెకు ఉంటోంది. మున్సిపల్ కార్యాలయంలో ఔట్ సోర్సింగ్ పద్ధతిన స్వీపర్‌గా పనిచేస్తున్నది. సొంత ఇల్లు లేకపోవడంతో డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు కోసం పలుమార్లు దరఖాస్తు చేసుకుంది. తాజాగా అధికారులు ప్రకటించిన తుది జాబితాతో తన పేరు లేకపోవడంతో ఆందోళనకు గురైంది. దీంతో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించింది. గమనించిన చుట్టుపక్కల వారు అప్రమత్తమై తలుపులు పగులగొట్టి ఆమెను రక్షించారు. ఇదే సమయంలో అక్కడికి చేరుకున్న మున్సిపల్ కౌన్సిలర్ రహీం ఆమెను పట్టణంలోని ప్రభుత్వాస్పత్రికి తరలించి చికిత్స చేయిస్తున్నారు. ప్రస్తుతం ఆమెకు ప్రాణాపాయం ఏమీలేదని వైద్యులు తెలిపారు.

ఆర్టిజన్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలి



విద్యుత్ భవన్ ఎదుట నిరసనలు తెలుపుతున్న ఉద్యోగులు

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): విద్యుత్ ఉద్యోగులతో సమానంగా విధులు నిర్వర్తిస్తున్న ఆర్టిజన్ కార్మికులకు ఉద్యోగ భద్రత కల్పించాలని టీఎస్‌పీఈజేఏసీ కమిటీ చైర్మన్ వీరభద్రయ్య అన్నారు. టీఎస్‌పీఈజేఏసీ ఆధ్వర్యంలో శుక్రవారం జిల్లా కేంద్రంలోని విద్యుత్ భవన్ ఎదుట విద్యుత్ ఉద్యోగులతో కలిసి నిరసన తెలిపారు. అనంతరం వీరభద్రయ్య మాట్లాడుతూ ఆర్టిజన్ ఉద్యోగులకు పీఆర్‌సీ, ఈపీఎఫ్, జీపీఎఫ్ చెల్లించాలని కోరారు. విద్యుత్ ఉద్యోగులు, కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేదంటే నిరసనలు కొనసాగిస్తామని తెలిపారు. కార్యక్రమంలో టీఎస్‌పీఈజేఏసీ కన్వీనర్ గంగాధర్, ఇన్‌చార్జ్ ఎస్‌ఈ మహేశ్, విద్యుత్‌శాఖ ఇంజనీర్స్, అకౌంట్ స్టాఫ్, ఓ అండ్ ఎం ఉద్యోగులు, టీఎస్‌పీఈజేఏసీ సంఘం నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, హుసేన్, పండరి, బాలకిషన్, చంద్రారెడ్డి, శ్రీధర్‌రెడ్డి, కుతుబొద్దీన్, లిమేష్, లక్ష్మారెడ్డి, రాంమోహన్, కనకరాజు తదితరులు పాల్గొన్నారు.

ఆడబిడ్డల గోడు పట్టదా?

- ప్రాజెక్టు కోసం మా పొలాలు.. ఇళ్లు ఇచ్చాం
- పెళ్లి చేసుకున్నామని ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ ఇవ్వనంటారా?
- ఇదెక్కడి న్యాయమంటూ గౌరవెల్లి ప్రాజెక్టు నిర్వాసితుల ఆవేదన
- 73 రోజులుగా వివాహితల నిరసన దీక్షలు



శుక్రవారం రాత్రి దీక్ష శిబిరంలో నినాదాలు చేస్తున్న వివాహితలు

హుస్నాబాద్: ప్రాజెక్టు పనుల్లో ఆలస్యం పెద్ద వివాదంగా మారింది. ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చాలంటూ 100 మంది వివాహితలు 73 రోజులుగా ఆందోళనలు చేస్తున్నారు. ప్రాజెక్టు నిర్వాసిత కుటుంబాలకు ప్రభుత్వం హామీ ఇచ్చినప్పుడు తమకు పెళ్లిళ్లు కాలేదని, ఇప్పుడు తమకు పెళ్లి అయ్యిందనే కారణంతో అనర్హుల్ని చేయడం సమంజసం కాదంటూ వారు వాపోతున్నారు.

రూ.6 లక్షలు, డబుల్ బెడ్‌రూం ఇల్లు ఇస్తామని..

హుస్నాబాద్ నియోజకవర్గంలో గౌరవెల్లి ప్రాజెక్టును 8.23 టీఎంసీల సామర్థ్యంతో నిర్మిస్తున్నారు. ప్రాజెక్టు భూసేకరణ ప్రారంభించినప్పుడు.. దీని వల్ల ముంపునకు గురవుతున్న గుడాటిపల్లి పంచాయతీ పరిధిలోని పల్లె, గిరిజన తండాల వారికి ఇతరత్రా హామీలతో పాటు కుటుంబంలో 18 సంవత్సరాలు నిండిన వివాహం కాని యువతులు ఉంటే ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ కింద రూ.6 లక్షల నగదు పాటు డబుల్ బెడ్‌రూం ఇళ్లు కట్టిస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఈ మేరకు 2010 నుంచి 2015 వరకు కటాఫ్‌గా తీసుకుని 141 మంది అర్హుల్ని గుర్తించారు. అనుకున్న సమయంలో ప్రాజెక్టును ప్రారంభించి వీరికి ఇచ్చిన హామీ మేరకు నగదు, ఇల్లు ఇచ్చేస్తే ఎలాంటి వివాదం తలెత్తేది కాదు. కానీ ప్రాజెక్టును ఆలస్యంగా ప్రారంభించడం, పనులు కొనసాగుతుండటం, హామీ అమలు చేయకపోవడంతో కటాఫ్‌ను పెంచుతూ పోయారు. ఈ విధంగా 2015 నుంచి 2021 వరకు మరో 338 మందిని, 2022 డిసెంబర్ వరకు మరో 60 మందిని అర్హులుగా అధికారులు గుర్తించారు. అయితే ఈ మధ్యకాలంలో కొందరు యువతులు వివాహాలు చేసుకోవడం, వీరికి ప్యాకేజీ వర్తించదని అధికారులు చెప్పడంతో ఆందోళనలు ప్రారంభమయ్యాయి.

జాబితా నుంచి తొలగింపు

మధ్యలో రెండేళ్ల ప్రాజెక్టు నిలిచిపోగా, గతేడాది డిసెంబర్ 9న మళ్లీ పనులు ప్రారంభించారు. అప్పుడు యువతులకు ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ చెక్కులు అందజేసే ప్రక్రియ ప్రారంభమైంది. అయితే మొత్తం 539 మంది అర్హుల్లో 2015 నుంచి 2022 మధ్యకాలంలో పెళ్లిళ్లు చేసుకున్నారనే కారణంతో సుమారు వంద మంది మహిళల పేర్లను ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీ జాబితా నుంచి అధికారులు తొలగించారు. దీంతో వారు లబోదిబోమన్నారు.

పట్టించుకోని ప్రజా ప్రతినిధులు

అధికారుల తీరును నిరసిస్తూ డిసెంబర్ 14 నుంచి అక్కన్నపేట మండలం గౌరవెల్లి ప్రాజెక్టు గుడాటిపల్లె గ్రామం వద్ద ఏర్పాటు చేసిన శిబిరంలో దీక్షలు కొనసాగిస్తున్నారు. సుమారు 73 రోజులుగా ఈ నిరసనలు కొనసాగుతున్నాయి.


ఇదేం న్యాయం?



మా త్యాగానికి ఎంత ఇచ్చిన తక్కువే. పెళ్లి కాని యువతులకు ప్యాకేజీ ఇస్తామంటూ మమ్మల్ని గుర్తించారు. ప్రాజెక్టు పనులు ప్రారంభించినప్పుడు మాకు పెళ్లి కాలేదు. ప్రాజెక్టు పనులు ప్రారంభమై దాదాపు 16 ఏళ్లు గడుస్తున్నాయి. ఇప్పుడు పెళ్లి అయ్యిందనే సాకుతో ప్యాకేజీ వర్తించదని అనడం ఏం న్యాయం?

– చుంచు రాజీ, నిర్వాసితురాలు

వయసు పెరుగుతుంది కానీ తగ్గుతుందా?



గౌరవెల్లి ప్రాజెక్టు అనుకున్న సమయానికి పూర్తి చేస్తే ఈ సమస్య ఉండేదు కాదు. వయస్సు పెరుగుతుందే కానీ తగ్గుతుందా? ప్రభుత్వం తప్పు చేసి మాకు అన్యాయం చేస్తే ఎలా? మా బాధలను కనీసం మంత్రికి కూడా చెప్పుకోనివ్వరా? ఆర్ అండ్‌ఆర్ ప్యాకేజీ ఇస్తే మాదారి మేము వెతుక్కుంటాం.

– భూక్య శిరీష, నిర్వాసితురాలు

గుడాటిపల్లి వద్ద హై టెన్షన్

అక్కన్నపేట: గుడాటిపల్లి వద్ద శుక్రవారం అర్ధరాత్రి అయినా వివాహితల దీక్ష కొనసాగింది. గ్రామానికి వెళ్లే రోడ్డు మూసివేత పనులు పోలీసు బలగాల మధ్య పనులు చేపడతారనే సమాచారంతో వివాహిత మహిళలు దీక్ష శిబిరం వద్ద ఆందోళన చేశారు. దీంతో హైటెన్షన్ వాతావరణం నెలకొంది.



గజ్వేల్‌లో నిర్వాసితులకు ఇళ్ల పట్టాలను పంపిణీ చేస్తున్న మంత్రి హరీశ్‌రావు

భూములు..ప్లాట్లు అమ్ముకోకండి

- భారీ పరిశ్రమల రాకతో ధరలు మరింతగా పెరుగుతయ్
- నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాల పంపిణీలో మంత్రి హరీశ్‌రావు

గజ్వేల్: పరిశ్రమల రాకతో గజ్వేల్ దశ మారిపోతోంది.. ధరలు మరింతగా పెరుగుతయ్..దండంపెట్టి చెబుతున్న భూములు..ప్లాట్లు అమ్ముకోకండి అంటూ రాష్ట్ర ఆర్థిక, వైద్యారోగ్యశాఖ మంత్రి హరీశ్‌రావు రైతులను కోరారు. వర్గల్‌లో ఏర్పాటు చేయనున్న టీఎస్ఐఐసీ ఫుడ్ పార్కులో భూములు కోల్పోతున్న నిర్వాసితులకు ఇళ్ల స్థలాల పట్టాలను శుక్రవారం గజ్వేల్‌లోని మహతి ఆడిటోరియంలో పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన సభలో హరీశ్‌రావు మాట్లాడుతూ పారిశ్రామికాభివృద్ధిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి పెట్టిందన్నారు. ఇప్పటికే గజ్వేల్ నియోజకవర్గంలోని ములుగులో కోకోకోలా కంపెనీ నిర్మాణం శరవేగంగా సాగుతున్నదని, వర్గల్ ఫుడ్ పార్కులో అమూల్ డెయిరీ ఏర్పాటు కాబోతున్నదన్నారు. ముస్కతీ డెయిరీతో పాటు భారీ రైసుమిల్లులు రాబోతున్నాయని స్పష్టం చేశారు. ఈ పరిశ్రమల్లో స్థానిక నిరుద్యోగ యువతతోపాటు, కొండపోచమ్మసాగర్, మల్లన్నసాగర్ నిర్వాసితులకు ఉపాధి అవకాశాలు అందేవిధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఇందుకోసం ప్రత్యేక సమావేశం నిర్వహించి కార్యాచరణ సిద్ధం చేయాలని కలెక్టర్ ప్రశాంత్ జీవన్‌పాటిల్‌ను ఆదేశించారు. ఇంకా ఈ సభలో మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి, ఎమ్మెల్సీలు యాదవరెడ్డి, ఫారూక్‌హుస్సేన్, రాష్ట్ర అటవీ అభివృద్ధి సంస్థ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి తదితరులు ప్రసంగించగా, జెడ్పీ చైర్‌పర్సన్ రోజాశర్మ, గజ్వేల్ మార్కెట్ కమిటీ చైర్మన్ మాదాసు శ్రీనివాస్, మున్సిపల్ చైర్మన్ రాజమౌళి, ఎంపీపీ అమరావతి తదితరులు పాల్గొన్నారు.

- పట్టణంలో ఎంసీహెచ్(మాతా శిశు సంరక్షణ ఆసుపత్రి) నిర్మాణ పనులను మంత్రి హరీశ్‌రావు పరిశీలించారు. ఈ సందర్భంగా డీఈ శివప్రసాద్‌ను వివరాలు అడిగి తెలుసుకున్నారు. మూడు నెలల్లో పనులను పూర్తి చేసి, ప్రారంభానికి సిద్ధం చేయాలని ఆదేశించారు.

సుప్రీంకోర్టు తీర్పు అమలు చేయాలి



కలెక్టరేట్ వద్ద ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న పద్మ

అంగన్‌వాడీ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ

సిద్దిపేటరూరల్: రాష్ట్రవ్యాప్తంగా ఉన్న అంగన్‌వాడీ టీచర్లు, ఆయాల సమస్యలను తక్షణమే పరిష్కరించాలని ఆ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పద్మ అన్నారు. కలెక్టర్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు చేస్తున్న ధర్నా శుక్రవారంతో మూడోరోజుకు చేరుకుంది. ఈ ధర్నాకు హాజరైన పద్మ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం రాష్ట్రంలో అంగన్‌వాడీ ఉద్యోగులకు గ్రాట్యుటీ చెల్లించాలన్నారు. ఈఎస్ఐ, ఉద్యోగభద్రత తదితర సౌకర్యాలు కల్పించాలి డిమాండ్ చేశారు. మినీ అంగన్‌వాడీ సెంటర్లను మెయిన్‌సెంటర్లుగా గుర్తించి ఉద్యోగులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలన్నారు. ఈ ధర్నాకు సంఘీభావంగా యునైటెడ్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు చంద్రారెడ్డి, హమాలీయూనియన్ రాష్ట్ర కోశాధికారి కనకయ్య, వీఆర్‌ఏ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాల్‌నర్సు మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షురాలు దాసరి కళావతి, అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు లక్ష్మి, జిల్లా కోశాధికారి పద్మ తదితరులు పాల్గొన్నారు.

జీవితంలో స్థిరపడాలంటే విద్యార్థి దశ కీలకం

సిద్దిపేట సీపీ శ్వేత



మాట్లాడుతున్న సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: "విద్యార్థి దశలో ఉన్నప్పుడు అన్ని విషయాలు నేర్చుకోవాలి.. జీవితంలో స్థిరపడాలంటే ఈ దశ కీలకం.. ప్రతి ఒక్కరూ జాగ్రత్తగా చదువుకొని భవిష్యత్‌లో ఉన్నతశిఖరాలు చేరుకోవాలని" సీపీ శ్వేత ఆకాంక్షించారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో వివిధ పోటీలు నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. అందులో భాగంగా శుక్రవారం సిద్దిపేటలోని వడ్డెపల్లి దయానంద్ ఫంక్షన్‌హాల్‌లో విద్యార్థులకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలను అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి సీపీ శ్వేత పరిశీలించారు. ఈ సందర్భంగా సీపీ మాట్లాడుతూ అంతర్జాతీయ మహిళా దినోత్సవ కార్యక్రమాల్లో భాగంగా 18 సంవత్సరాల్లోపు బాలబాలికలకు నిర్వహించిన వ్యాసరచన, ఉపన్యాస, చిత్రలేఖన పోటీలకు విశేష స్పందన లభించిందన్నారు. 25 మండల కేంద్రాల్లో ఈ పోటీలు నిర్వహించామని, 4,084 మంది బాలబాలికలు ఇందులో పాల్గొన్నారు.

క్లుప్తంగా

ప్రీతి మృతికి కారకుడిని కాపాడేయత్నం

ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్



ఏబీవీపీ నాయకుల నిరసన ర్యాలీ

దుబ్బాకటౌన్: కాకతీయ యూనివర్సిటీ మెడికల్ కళాశాల పీజీ విద్యార్థిని ప్రీతి మృతికి కారకుడిని ప్రభుత్వ పెద్దలే కాపాడే ప్రయత్నం చేస్తున్నారని ఏబీవీపీ జిల్లా కన్వీనర్ వివేక్ తీవ్ర ఆరోపణ చేశారు. శుక్రవారం దుబ్బాకలో ఏబీవీపీ ఆధ్వర్యంలో వైద్య విద్యార్థిని ప్రీతి మృతికి కారకుడైన సైఫ్‌ను కఠినంగా శిక్షించాలంటూ నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిందితుడికి ప్రభుత్వ పెద్దలు అండ ఉండటంతోనే ఇంతవరకు అతడిపై ఎలాంటి చర్య తీసుకోవడం లేదన్నారు. మృతురాలి కుటుంబానికి న్యాయం జరిగే వరకు ఉద్యమిస్తామన్నారు. కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు కార్తీక్, మహేశ్, గణేశ్, ప్రవీణ్ తదితరులు ఉన్నారు.

ఆటో బైక్ ఢీ: ఇద్దరికి గాయాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఆటో, బైక్ ఢీకొనడంతో ఇద్దరికి గాయాలయ్యాయి. ఈ సంఘటన కౌడిపల్లి మండలం రాయిలాపూర్‌గేట్ సమీపంలో 765 డి జాతీయ రహదారిపై శుక్రవారం జరిగింది. బాధితులు, స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. బూర్గుపల్లి గ్రామానికి చెందిన సత్యనారాయణ తన బైక్‌పై హైదరాబాద్ వెళ్లి తిరిగి వస్తున్నాడు. ఇదే క్రమంలో కౌడిపల్లి మండలం భుజిరంపేట పంచాయతీ వెంకటాపూర్ గ్రామానికి చెందిన ఆటో డ్రైవర్ ఆబేద్ నర్సాపూర్ వెళ్తున్నాడు. రాయిలాపూర్ గేట్ సమీపంలో ఆటో, బైక్ ఢీకొన్నాయి. ఈ ఘటనలో సత్యనారాయణకు, ఆటోలో ఉన్న ఆబేద్‌కు గాయాలయ్యాయి. క్షతగాత్రులను చికిత్స కోసం 108లో నర్సాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కేసు నమోదుచేసుకుని పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

వివాహిత అదృశ్యం



రమణ (ఫైల్)

దుబ్బాక: వివాహిత అదృశ్యమైన ఘటన రాయపోల్ మండలం కొత్తపల్లి గ్రామంలో జరిగింది. రాయపోల్ ఎస్‌ఐ షేక్ మహబూబ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండల పరిధిలోని కొత్తపల్లి గ్రామానికి చెందిన కస్తూరి రమణ(28)కు పదేళ్ల క్రితం రాజుతో వివాహం జరిగింది. భార్యాభర్తలకు మధ్య మనస్పర్థలు రావడంతో ఫిబ్రవరి 28వ తేదీన ఆమె ఇంటి నుంచి వెళ్లి తిరిగి రాలేదు. ఆమె కోసం వెతికినా ఆచూకీ దొరకలేదు. రమణ అన్న సంజీవులు శుక్రవారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

భార్యాపిల్లలను కొట్టిన వ్యక్తికి రెండేళ్ల జైలు

మెదక్ మున్సిపాలిటీ: మద్యం మత్తులో భార్యాపిల్లలు, అత్తను గాయపరిచిన వ్యక్తికి కోర్టు జైలు శిక్ష విధించింది. శుక్రవారం జిల్లా ఎస్పీ రోహిణీ ప్రియదర్శిని తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పెద్దశంకరంపేట మండలం కమలాపూర్ గ్రామానికి చెందిన నసిమి దత్తమ్మ 2019 డిసెంబర్ 16వ తేదీ రాత్రి తన ఇంట్లో వంట చేస్తోంది. ఆమె భర్త నసిమి విఠల్ మద్యం తాగొచ్చి ఆమెను, కూతురు మమతను చంపుతానంటూ బండరాయితో తలపై కొట్టాడు. అడ్డం వచ్చిన ఆమె తల్లి పెంటమ్మను కొట్టడంతో తీవ్రంగా గాయపడింది. అందరినీ చంపుతానంటూ బెదిరించాడు. దీంతో బాధితులు ఫిర్యాదు చేయగా అప్పటి పోలీసులు కేసు నమోదు చేశారు. శుక్రవారం మెదక్ జిల్లా కోర్టులో కేసు విచారణకు రాగా జడ్జి జితేందర్ విచారణ చేశారు. నేరం రుజువు కావడంతో నసిమి విఠల్‌కు రెండేళ్ల కఠిన జైలు శిక్ష విధిస్తూ తీర్పునిచ్చినట్లు ఎస్పీ తెలిపారు. నిందితుడికి శిక్ష పడేలా కృషి చేసిన కోర్టు కానిస్టేబుళ్లను, సిబ్బందిని ఎస్పీ అభినందించారు.

అవ్వా బాగున్నవా..

నర్సవ్వతో మంత్రి హరీశ్‌రావు మాటామంతీ



ఇందుప్రియాల్‌లో నర్సవ్వతో ముచ్చటిస్తున్న మంత్రి హరీశ్‌రావు

దుబ్బాకటౌన్: సిద్దిపేట జిల్లా దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్‌లో శుక్రవారం మంత్రి హరీశ్‌రావు పర్యటనలో ఆసక్తికర సన్నివేశం చోటు చేసుకుంది. ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డితో కలిసి ఇందుప్రియాల్‌లో గాంధీ విగ్రహ ఆవిష్కరణతో పాటు పలు అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొనేందుకు గ్రామంలో కాలినడకన పర్యటిస్తున్నారు. ఈ క్రమంలో ఓ అరుగుపై కూర్చున్న 70 ఏళ్లపై బడ్డ నలుగురు వృద్ధులు తారసపడ్డారు. దీంతో వారిని చూసిన మంత్రి ఏం అవ్వలు బాగున్నారా అంటూ ఆప్యాయంగా పలకరించారు. అరుగుపైకూర్చుని ముచ్చటించారు. వృద్ధురాలు వేంపల్లె నర్సవ్వతో మంత్రి హరీశ్‌రావు జరిపిన సంభాషణ ఇలా..

మంత్రి: అవ్వా బాగున్నవా? నీ పేరేంటి?

నర్సవ్వ: బాగున్న బిడ్డ. నా పేరు నర్సవ్వ.

మంత్రి: ఆరోగ్యం బాగుందా? పింఛన్ వస్తుందా?

నర్సవ్వ: బాగుంది బిడ్డ.

ఫింఛన్ రూ.2016 వస్తుంది

మంత్రి: నేనెవరినో తెలుసా అవ్వా?

నర్సవ్వ: అయ్యో బిడ్డ నువ్వు హరీశ్‌రావువి. ఇయ్యల్ల నువ్వు వస్తవని తెలిసే నిన్ను చూసేందుకు గీడ కూసున్నం.

మంత్రి: మంచినీళ్లు వస్తున్నయా అవ్వ ?

నర్సవ్వ: రోజు పొయ్యికాడి దాక వస్తున్నయి బిడ్డ. గప్పట్ల నీళ్లకు చానగోసుండేది. బోరింగ్ కాడి నుంచి మోసి మోసి భుజాలు కాయలు గాసినయ్ బిడ్డ. అప్పుడు నీళ్లకు బాగా ఇబ్బంది ఉండేది. నువ్వు సల్లంగ ఉండు బిడ్డ. మంచి పనులు చేస్తున్నవు అంటు చేతులు జోడించింది.

మంత్రి: నర్సవ్వ పాయ్యస్త ఆరోగ్యం జాగ్రత్త

నర్సవ్వ: మంచిగుండు బిడ్డ. నాకు చానా సంతోషంగా ఉంది అంటూ మంత్రి రెండు చేతులు గట్టిగా పట్టుకొంది.

మంత్రి హరీశ్‌రావు అరుగుపై కూర్చుని ముసలవ్వతో పది నిమిషాల పాటు ఆప్యాయంగా జరిపిన సంభాషణ సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టింది. ఎంపీ ప్రభాకర్‌రెడ్డితో పాటు అక్కడున్న ప్రజలు, ప్రజాప్రతినిధులు వారి సంభాషణను ఆసక్తిగా వినడం విశేషం.

వ్యక్తిగత దూషణలు మానుకోవాలి



మాట్లాడుతున్న మున్సిపల్ చైర్ పర్సన్ ఆకుల రజిత

హుస్నాబాద్: పాదయాత్ర పేరుతో గ్రామాల్లో పర్యటిస్తున్న టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ఎమ్మెల్యే సతీశ్‌కుమార్‌పై వ్యక్తిగత దూషణ చేయడం సరికాదని మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజిత అన్నారు. ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శుక్రవారం బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. 1.5 టీఎంసీల గౌరవెల్లి ప్రాజెక్టును కాంగ్రెస్ హయాంలో పదేళ్లైనా పూర్తి చేయలేదని, సీఎం కేసీఆర్ నేతృత్వంలో ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ కృషితో 8 ఏళ్లలో 8.23 టీఎంసీలకు పెంచి 99 శాతం పనులు పూర్తయ్యాయని అన్నారు. నియోజకవర్గ అభివృద్ధిలో నంబర్ వన్‌గా నిలిచారని కొనియాడారు. సమావేశంలో ఎంపీపీ లకావత్ మానస, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ ఎడబోయిన రజని, బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు వెంకట్రాంరెడ్డి, పట్టణ అధ్యక్షుడు అన్వర్ పాష, కౌన్సిలర్ వాల సుప్రజ, కో ఆప్షన్ అయూబ్, తిరుపతి రెడ్డి, లక్ష్మణ్, రమేష్, చిరంజీవి, క్రాంతి రెడ్డి తదితరులు ఉన్నారు.

మరమ్మతులు షురూ



మెట్టు వద్ద రోడ్డు మరమ్మతు పనులు కొనసాగుతున్న దృశ్యం

తొగుట(దుబ్బాక): మండలంలోని బీటీ రోడ్ల మరమ్మతులకు ప్రభుత్వం రూ.10.74 కోట్లు మంజూరు చేయడంతో గ్రామాల్లో రహదార్లకు మరమ్మతులు చేపట్టారు. రూ 4.57కోట్లతో మెట్టు నుంచి చందాపూర్ వరకు 13 కిలోమీటర్ల వరకు చేపట్టిన బీటీ రోడ్డు మరమ్మతు పనులు శుక్రవారం ప్రారంభమయ్యాయి. బండారుపల్లి, పెద్ద మాసాన్‌పల్లి రోడ్డు మరమ్మతుకు రూ.2.42కోట్లు, తుక్కాపూర్ నుంచి ఘనపురం వరకు రూ.94.20 లక్షలు, జప్తిలింగారెడ్డిపల్లి నుంచి వాగు గడ్డ వరకు రూ.38 లక్షలు, తుక్కాపూర్ నుంచి పీడబ్ల్యూ రోడ్డు వరకు రూ.22 లక్షలు, గుడికందుల, గోవర్దనగిరి మీదుగా మర్రికుంట పీడబ్ల్యూ రోడ్డు వరకు రూ.112.60 కోట్లు, తొగుట మండల కేంద్రం నుంచి లింగంపేట పీడబ్ల్యూ రోడ్డు వరకు రూ.1.03 కోట్లు, వెంకట్రావుపేట -లింగాపూర్ మీదుగా సూరంపల్లి వరకు రూ.4.63 కోట్లు విడుదలయ్యాయి. బీటీ రోడ్ల మరమ్మతు పనులు చేపట్టడంపై తుక్కాపూర్ సర్పంచ్, బీజేపీ మండల అధ్యక్షుడు చిక్కుడు చంద్రం హర్షం వ్యక్తంచేశారు.

ఘనంగా రథోత్సవం



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

దుబ్బాక: రాయపోల్ మండలం వడ్డేపల్లి గ్రామంలో ప్రసన్న వీరభద్ర స్వామి బ్రహ్మోత్సవాలు శుక్రవారం ఘనంగా నిర్వహించారు. అగ్ని గుండాలు తొక్కుట, స్వామి వారి రథోత్సవ ఊరేగింపు, రుత్విక్ సన్మానం కార్యక్రమాలను చేపట్టారు. డప్పు చప్పులతో గ్రామ పురవీధుల గుండా స్వామి వారి రథాన్ని ఊరేగించారు. సాయంత్రం స్వామి వారికి దోపుసేవ, పూజలు చేశారు.

అధ్యాపకుడికి సన్మానం



రవీందర్ రెడ్డిని సన్మానిస్తున్న మోడల్ స్కూల్ అధ్యాపక బృందం

హుస్నాబాద్: హుస్నాబాద్ మోడల్ స్కూల్‌లో పీజీటీ మ్యాథ్స్ టీచర్‌గా విధులు నిర్వర్తిస్తున్న రవీందర్‌రెడ్డికి డాక్టరేట్ లభించిందని కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ మల్లారెడ్డి శుక్రవారం తెలిపారు. డాక్టర్ ఎల్.పి.రాజ్‌కుమార్ పర్యవేక్షణలో 'మ్యాథమెటికల్ మోడలింగ్ ఆఫ్ డిసీషన్ మేకింగ్ ఆప్టిమైజేషన్ ప్రాబ్లమ్ అండర్ ఫజీ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై రవీందర్‌రెడ్డి పరిశోధన పూర్తి చేశాడు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు రవీందర్‌రెడ్డిని శాలువాతో ఘనంగా సన్మానించారు.

వైన్‌షాప్‌లో చోరీ

చేర్యాల(సిద్దిపేట): వైన్‌షాప్‌లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. ఈ ఘటన పట్టణ కేంద్రంలో చోటు చేసుకుంది. ఎస్‌ఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. పట్టణ కేంద్రంలోని శ్రీలక్ష్మీ వైన్స్ నిర్వాహకులు గురువారం రాత్రి షాప్ మూసివేసి వెళ్లారు. శుక్రవారం ఉదయం షాప్‌లో పనిచేసే సిబ్బంది వచ్చి చూడగా షట్టర్ తాళాలు పగులగొట్టి ఉండటం గమనించారు. చోరీ జరిగినట్లు గ్రహించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. మొత్తం రూ.9090 విలువగల మద్యం బాటిళ్లు, నగదు ఎత్తుకెళ్లినట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు.

భార్య పుట్టింటికి వెళ్లిందని..

మునిపల్లి(అందోల్): భార్య పుట్టింటికి వెళ్లి తిరిగి రాకపోవడంతో మనస్తాపంతో భర్త ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ సంఘటన మండలంలోని కంకోల్ శివారులో శుక్రవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. న్యాల్‌కల్ మండలం హద్నూర గ్రామానికి చెందిన కోరంపల్లి శ్రీశైలం (35) మునిపల్లి మండలం లింగంపల్లిలో ఉంటున్నాడు. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. ఇతడికి భార్య సుజాత, ముగ్గురు ఆడపిల్లలు, కుమారుడు ఉన్నారు. గతంలో శ్రీశైలం జైలు శిక్ష అనుభవించి వచ్చాడు. అప్పటి నుంచి భార్యభర్తలు గొడవపడుతున్నారు. గొడవల నేపథ్యంలో సుజాత న్యాల్‌కల్‌లోని పుట్టింటికి వెళ్లి తిరిగిరాలేదు. దీంతో మనస్తాపం చెంది శుక్రవారం కంకోల్ శివారులో శ్రీశైలం చెట్టుకు ఉరివేసుకున్నాడు. మృతుడి భార్య సుజాత ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.

నిధుల మంజూరుపై హర్షం

తొగుట(దుబ్బాక): దుబ్బాక నియోజకవర్గంలో అభివృద్ధి పనులకు నిధులు మంజూరు చేయడంపై బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు రాంరెడ్డి, ఎఎంసీ చైర్మన్ కొమురయ్య హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని వెంకట్రావుపేటలో శుక్రవారం మాట్లాడుతూ.. మంత్రి హరీశ్‌రావు, ఎంపీ ప్రభాకర్‌రెడ్డి సహకారంతో రోడ్ల మరమ్మతుకు రూ.40 కోట్లు మంజూరైనట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నర్సింలు యాదవ్, ఎంపీటీసీ నర్సింలు, ఎఎంసీ డైరెక్టర్ పర్శరాములు, బీఆర్‌ఎస్ నాయకులు స్వామిగౌడ్, కనకయ్య, అర్జున్, నారాయణ పాల్గొన్నారు.

మతిస్థిమితంలేని తల్లి కొడుతోందని..

- భరించలేక ఇంటి నుంచి పారిపోతున్న బాలికలు
- చేరదీసి అధికారులకు అప్పగించిన గ్రామస్తులు



చిన్నారులతో మాట్లాడుతున్న ఐసీడీఎస్ అధికారులు

అల్లాదుర్గం(మెదక్): మతిస్థిమితం లేని తల్లి తరచూ కొడుతుండటంతో భరించలేని ఇద్దరు బాలికలు ఇంటి నుంచి పారిపోతున్నారు. రహదారిపై వారిని చూసిన ఉపాధి హామీ కూలీలు గమనించి చేరదీశారు. విషయం తెలుసుకుని ఇంటికి పంపించే ప్రయత్నం చేయగా వెళ్లమని చెప్పడంతో ఐసీడీఎస్ అధికారులకు అప్పగించారు. ఈ సంఘటన శుక్రవారం అల్లాదుర్గం మండలం కాయిదంపల్లి గ్రామంలో చోటు చేసుకుంది. గ్రామస్తులు తెలిపిన వివరాలు ఈ విధంగా ఉన్నాయి. కాయిదంపల్లి గ్రామానికి చెందిన కర్రెళ్ల మొగులయ్య, పాపమ్మ దంపతులకు ఇద్దరు ఆడపిల్లలు ప్రియాంక(10), మధుప్రియ(7) ఉన్నారు. గతంలో తండ్రి మొగులయ్య మృతి చెందాడు. పిల్లలను తల్లి పోషిస్తోంది. కాగా కొంత కాలంగా పాపమ్మ మనసిక జబ్బుతో బాధపడుతోంది. తరచూ పిల్లలను కొడుతోంది. శుక్రవారం కూడా కొట్టడంతో ఇంటి నుంచి వెళ్తూ గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీలకు కనిపించారు. అక్కాచెల్లెళ్లను చూసి ఎక్కడికి వెళ్తున్నారని ప్రశ్నించగా అమ్మ కొడుతోందని అందుకే ఇంటి నుంచి వెళ్లిపోతున్నామని బదులిచ్చారు. వారిని తమ ఇంటికి తీసుకెళ్లి భోజనం పెట్టి ఇక్కడే ఉండాలని సముదాయించారు. ఇంటికి వెళ్లాలని చెప్పడంతో తాము వెళ్లమని చెప్పారు. దీంతో స్థానికులు అల్లాదుర్గం ఐసీడీఎస్ అధికారులకు సమాచారం ఇచ్చారు. విషయం తెలుసుకున్న అల్లాదుర్గం ఇన్‌చార్జి సీడీపీఓ వెంకటరమణ, సూపర్‌వైజర్ నాగమణి చిన్నారులను చేరదీసి సముదాయించారు. అమ్మ వద్దకు వెళ్లమని చెప్పిన వారు వెళ్లమని చెప్పడంతో ప్రియాంక, మధుప్రియను జిల్లా కేంద్రంలోని బాలసదన్‌కు తరలిస్తామని, బాధ్యత ప్రభుత్వం తీసుకుంటుందని వారు తెలిపారు.

మందుబాబులకు జరిమానా

సిద్దిపేటకమాన్: సిద్దిపేటలో సిద్దిపేట ట్రాఫిక్ సీఐ రామకృష్ణ తమ సిబ్బందితో వాహన తనిఖీలు చేపట్టారు. తనిఖీల్లో 11 పట్టుబడ్డారు. వారిని సిద్దిపేట కోర్టులో హాజరుపర్చగా జడ్జి రమేశ్‌బాబు రూ.24,500 జరిమానా విధించారు.

జయంతి నిర్వహణలో విఫలం

హుస్నాబాద్: గిరిజనుల ఆరాధ్య దైవం సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని అధికారికంగా నిర్వహించడంలో ప్రభుత్వం విఫలమైందని గిరిజన విద్యార్థి సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుగులోతు భాస్కర్ నాయక్ అన్నాడు. శుక్రవారం విలేకరులతో మాట్లాడుతూ హుస్నాబాద్ నియోజకవర్గంలో గిరిజనుల జనాభా అధికంగా ఉందని, ఫిబ్రవరి 15న సేవాలాల్ జయంతిని నేటి వరకు నిర్వహించకపోవడంపై గిరిజన జెడ్పీటీసీలు, ఎంపీపీలు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశాడు. ప్రభుత్వం వెంటనే స్పందించి సేవాలాల్ జయంతిని అధికారికంగా నిర్వహించాలని కోరారు. సమావేశంలో సంఘ నాయకులు రమేష్ నాయక్, కళ్యాణ్ నాయక్, సుమన్ నాయక్, సంపత్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు

సీపీ శ్వేత

సిద్దిపేటకమాన్: సిద్దిపేట పోలీసు కమిషనరేట్ పరిధిలో సైబర్ నేరాల నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు సీపీ శ్వేత తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ కమిషనరేట్ పరిధిలో ప్రతీరోజు ఏ రకమైన సైబర్ నేరాలు జరుగుతున్నాయో పత్రికల ద్వారా తెలియజేస్తామన్నారు. సైబర్ నేరగాళ్లు తక్కువ సమయంలో ఎక్కువ సంపాదించవచ్చని ఆశ చూపి మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వ్యక్తిగత సమాచారం సామాజిక మాధ్యమాల్లో పంచుకోకూడదని, ఫోన్లు వినియోగించేటపుడు జాగ్రత్తగా ఉండాలన్నారు. సైబర్ క్రైమ్ జరిగిన వెంటనే 1930కు ఫిర్యాదు చేయాలని సూచించారు. శుక్రవారం సిద్దిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన సైబర్ నేరాల వివరాలు తెలిపారు.

- సిద్దిపేట టూ టౌన్ పరిధిలోని ఓ వ్యక్తికి అపరిచితుడు ఫోన్ చేసి మీ బ్యాంకు ఖాతా బ్లాక్ అయింది, మీ పాన్ కార్డు అప్‌డేట్ చేయాలని ఓ లింకు పంపాడు. ఆ లింకును క్లిక్ చేయడంతో బాధితుడి ఖాతా నుంచి రూ.1,28,650 డెబిట్ అయ్యాయి.
- అలాగు పాన్‌కార్డు అప్‌డేట్ చేయాలని చెప్పి పట్టణానికి చెందిన మరో వ్యక్తి ఖాతా నుంచి రూ.12,010 సైబర్ నేరస్తుడు కాజేశాడు.
- దుబ్బాక పోలీస్ స్టేషన్ పరిధిలోని ఓ వ్యక్తి ఆన్‌లైన్‌లో క్యాష్ పిన్ యాప్ ద్వారా రూ.12,317 లోన్ తీసుకున్నాడు. ఆ డబ్బులు చెల్లించినా, బాధితుడికి లోన్ యాప్ నిర్వాహకులు మళ్లీ మళ్లీ ఫోన్ చేస్తున్నారు. ఇంకా డబ్బులు చెల్లించాలని లేనట్లయితే కుటుంబ సభ్యుల ఫొటోలు మార్ఫింగ్ చేసి ఇంటర్‌నెట్‌లో పెడతామని బెదిరించడంతో బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.
- దౌల్తాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ వ్యక్తికి మీకు గిఫ్ట్ వచ్చింది, దానికి ప్రాసెసింగ్ చార్జీల చెల్లించాలని అపరిచితుడు ఫోన్ చేశాడు. అది నమ్మి బాధితుడు రూ.49,500 పంపించాడు. అనంతరం ఆ నంబర్‌కు ఫోన్ చేయగా స్పందించలేదు. దీంతో తాను మోసపోయినట్లు గ్రహించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

కుక్కల దాడిలో 12 గొర్రె పిల్లలు మృతి

- మరో 12లో మేకలు, గొర్రెలకు గాయాలు
- రూ.1.50 లక్షల నష్టం



కౌడిపల్లిలో ఊర కుక్కల దాడిలో మృతిచెందిన జీవాలు

కౌడిపల్లి(నర్సాపూర్): ఊర కుక్కల దాడిలో కొన్ని జీవాలు మృత్యువాతపడగా, మరికొన్ని గాయపడ్డాయి. వివరాలు ఇలా ఉన్నాయి. మండల కేంద్రమైన కౌడిపల్లి గ్రామానికి చెందిన ఇట్టబోయిన పోచయ్య గొర్రెలు, మేకల పెంపకంతో కుటుంబాన్ని పోషించుకుంటున్నాడు. రోజుమాదిరిగానే గురువారం రాత్రి కొట్టంలో వాటిని వదిలిపెట్టాడు. రాత్రి ఊర కుక్కలు గొర్రెల కొట్టంలో ప్రవేశించి దాడి చేయడంతో 12 గొర్రె పిల్లలు మృతి చెందగా మరో 12లో మేకలు, గొర్రెలు తీవ్రంగా గాయపడ్డాయి. సుమారు రూ.1.50 లక్షలు నష్టం వచ్చిందని బాధితుడు తెలిపాడు. ఈ విషయం పశువైద్యాధికారికి తెలపడంతో ఆయన వచ్చి గాయపడినవారికి చికిత్స చేశాడు. జీవాల మృతి చెందడటంతో తీవ్రంగా నష్టపోయానని ప్రభుత్వం స్పందించి ఆదుకోవాలని బాధితుడు విజ్ఞప్తి చేశాడు. కాగా వెటర్నరీ అసిస్టెంట్ చెన్నయ్య మాట్లాడుతూ చనిపోయన వాటికి బీమా లేదన్నారు. ఈ విషయం జిల్లా అధికారులకు తెలియచేస్తామనన్నారు. గ్రామంలో ఊర కుక్కలు, కోతుల బెడద ఎక్కువగా ఉందన్నారు.

కుక్కను తప్పించబోయి..

సిద్దిపేటఅర్బన్: అడ్డుగా వచ్చిన కుక్కను తప్పించబోయి డివైడర్‌ను ఢీకొని బైక్‌పై ప్రయాణిస్తున్న వ్యక్తి మృతి చెందాడు. ఈ సంఘటన గురువారం రాత్రి సిద్దిపేట పట్టణంలోని కోమటిచెరువు బైపాస్‌లో జరిగింది. సిద్దిపేట త్రీటౌన్ సీఐ భానుప్రకాశ్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సిద్దిపేట రూరల్ మండలం పెద్దలింగారెడ్డి పల్లి గ్రామానికి చెందిన మోకిల్ల రవీందర్‌రెడ్డి (45) సిద్దిపేటలో ఉంటూ కూలీ పనులు చేసుకుంటూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం అర్ధరాత్రి కోమటి చెరువు బైపాస్ లో బైక్‌పై ఇంటికి వెళ్తుండగా అడ్డుగా కుక్క రావడంతో దానిని తప్పించబోయి అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టాడు. తీవ్రగాయాలై అక్కడికక్కడే మృతి చెందాడు. గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో సంఘటనా స్థలానికి చేరుకొని మృతదేహాన్ని సిద్దిపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. మృతుడికి భార్య, కుమారుడు ఉన్నారు.

భార్యపై దాడిచేసిన భర్త

గాయపడిన భార్య, కేసునమోదు



కొత్తపేటలో విచారణ చేస్తున్న పోలీసులు

శివ్వంపేట(నర్సాపూర్): భార్యపై దాడిచేసి గాయపరిచిన భర్తపై కేసునమోదు చేసినట్లు ఎస్‌ఐ రవికాంతరావు తెలిపారు. శుక్రవారం పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మండలంలోని అల్లీపూర్ గ్రామానికి చెందిన గుమ్మల పోచయ్య కూతురు మీనాను కొత్తపేట గ్రామానికి చెందిన అశోక్‌కిచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. కట్నకానుకల కింద కిలో వెండి, ఎనిమిది తులాల బంగారు ఆభరణాలు, బైక్, రూ.50 వేలు ఇచ్చారు. కొన్ని నెలల తర్వాత అదనపు కట్నం తేవాలని మీనాను భర్త అశోక్, అత్త భారతమ్మ, మామ నర్సయ్య వేధిస్తున్నారు. ఈక్రమంలో జనవరి 22వ తేదీన అత్తింటివారు మీనాతో మళ్లీ వేధించి పుట్టింటికి వెళ్లగొట్టారు. ఈ విషయంలో ఇద్దరికీ రాజీ కుదిర్చేందుకుగాను పెద్దమనుషుల సమక్షంలో మాట్లాడుకుందామని కొత్తపేట వెళ్లారు. పెద్దమనుషులు మాట్లాతుండగా మీనాను భర్త అశోక్ రాయితో కొట్టడంతో ఆమెకు తీవ్ర గాయాలయ్యాయి. బాధితురాలి తండ్రి ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

విద్యార్థుల ఫిర్యాదుపై విచారణ



శాదుల్లా బాబాను ప్రశ్నిస్తున్న ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి

కొండపాక(గజ్వేల్): కుకునూరుపల్లి హైస్కూల్ సాంఘిక శాస్త్రం ఉపాధ్యాయుడిపై విద్యార్థులు, తల్లిదండ్రులు చేసిన ఫిర్యాదుపై అధికారులు చర్యలు చేపట్టారు. డీఈఓ ఆదేశాల మేరకు శుక్రవారం ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి విచారణ చేశారు. పాఠ్యాంశాల సందేహాలను అడిగిన విద్యార్థినులపై అనుచిత వాఖ్యలు, పరీక్షల్లో ఫెయిల్ చేస్తామంటూ 7వ తరగతి క్లాస్ టీచర్ శాదుల్లాబాబా బెదిరించడంతో అతడిపై ఫిర్యాదు చేసిన విషయం పాఠకులకు విధితమే. విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయుల సమక్షంలో ఎస్‌ఎంసీ చైర్మన్ మల్లం ఐలయ్య శాదుల్లా బాబాను ప్రశ్నించగా మరోమారు తప్పు జరగకుండా చూసుకుంటామని ఎంఈఓకు లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారు. అనంతరం ఎంఈఓ మాట్లాడుతూ విద్యార్థుల సందేహాలను నివృత్తి చేయడంలో నిర్లక్ష్యం చేస్తే క్షమించేది లేదంటూ హెచ్చరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం బాలకిషన్, ఉపాధ్యాయులు సత్యనారాయణరెడ్డి, ఫ్రాన్సిస్, అజయ్‌కుమార్‌రెడ్డి, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆస్తికోసం అంతమొందించాడు

- బావమరిదిని హత్యచేసిన బావ
- మరో నలుగురితో కలిసి ఘాతుకం
- మృతదేహాన్ని సాగర్‌లో పడేసిన నిందితులు
- ఒకరు పరారీ, నలుగురి అరెస్ట్



వివరాలు వెల్లడిస్తున్న సీపీ శ్వేత, పక్కన అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్

సిద్దిపేటకమాన్: హత్యకుగురై కొండపోచమ్మ సాగర్‌లో శవమై తేలిన కేసు మిస్టరీని పోలీసులు ఛేదించారు. నిందితులను అరెస్ట్ చేసి జైలుకు తరలించినట్లు సిద్దిపేట పోలీసు కమిషనర్ ఎన్.శ్వేత తెలిపారు. శుక్రవారం పోలీసు కమిషనర్ కార్యాలయంలో అడిషనల్ డీసీపీ అడ్మిన్ మహేందర్‌తో కలిసి సీపీ శ్వేత శుక్రవారం విలేకరులకు వెల్లడించారు. ఫిబ్రవరి 27వ తేదీన ములుగు ఎస్‌ఐ రంగకృష్ణ తమ సిబ్బందితో కలిసి కొండపోచమ్మ సాగర్ పరిసర ప్రాంతాల్లో పెట్రోలింగ్ నిర్వహిస్తుండగా గుర్తు తెలియని వ్యక్తి మృతదేహాన్ని కొండపోచమ్మ సాగర్‌లో గుర్తించారు. ఆధారాలు లభించకపోవడంతో మృతుడి ఫొటోలు సోషల్ మీడియాలో పోస్ట్ చేశారు. మృతుడు సంగారెడ్డి జిల్లా, కంది మండలం ఇంద్రకరణ్ గ్రామానికి చెందిన చాకలి మధు (27)గా కుటుంబ సభ్యులు గుర్తించారు. మృతుడి చెల్లెలు చాకలి మౌనిక తన అన్న మధును గుర్తు తెలియని వ్యక్తులు హత్య చేసి కొండపోచమ్మ సాగర్‌లో పడేశారని పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో ములుగు పోలీసులు కేసు నమోదు చేసి, గజ్వేల్ ఏసీపీ రమేశ్ ఆధ్వర్యంలో రెండు బృందాలుగా ఏర్పడి దర్యాప్తు చేపట్టారు. సాంకేతిక సాయంతో పోలీసులు నిందితులను పట్టుకున్నారు. నేరం చేసినట్లు ఒప్పుకున్నారు. మృతుడు మధు చెల్లెలు మౌనికను మూడేళ్ల క్రితం సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం రుద్రారం గ్రామానికి చెందిన చాకలి రాములు (32)తో వివాహం జరిపించారు. వివాహ సమయంలో మధుకు ఉన్న ఎకరం భూమిలో నుంచి మూడు గుంటలు మౌనిక పేరుపై రిజిస్టర్ చేయించి ఇచ్చారు. మధు జల్సాలకు అలవాడుపడ్డాడు. ఎకరం భూమిలో నుంచి కొద్ది కొద్దిగా అమ్ముతూ వచ్చిన డబ్బు ఖర్చు చేశాడు. మౌనికకు ఇచ్చిన మూడు గుంటల భూమితోపాటు తనకున్న మరో ఐదు గుంటల భూమిని విక్రయించాడు. గుంటకు రూ.8 లక్షల చొప్పున అమ్మగా వచ్చిన డబ్బుల్లో చెల్లెలుకు రూ.11 లక్షలు మాత్రమే ఇచ్చాడు. దీంతో కోపం పెంచుకున్న బావ రాములు బావమరిదిని చంపితే అతని పేరిట ఆస్తి మొత్తం తనకే దక్కుతుందనే ఆలోచనతో మధును హత్య చేయాలని పథకం వేసుకున్నారు. శ్రీకాకుళం జిల్లా పైరువాడ మండలానికి చెందిన డీసీఎం డ్రైవర్ బూర్ల ఈశ్వర్‌రావు, స్నేహితుడు సంగారెడ్డి జిల్లా, పటానుచెరు మండలం, రుద్రారం గ్రామానికి చెందిన వడ్డే మహేశ్‌లకు డబ్బులు ఇస్తానని హత్యకు సహాయం చేయాలని కోరాడు. దీనికి అంగీకరించిన ఈశ్వర్ తనకు తెలిసిన ములుగు మండలం మామిడ్యాలకు చెందిన పసుల మల్లేశ్, ములుగు మండలం బైలంపూర్‌కు చెందిన జూపల్లి శేఖర్‌లతో కలిసి ఫిబ్రవరి 24వ తేదీన ముందుగా వేసుకున్న పథకం ప్రకారం తక్కువ ధరకు భూమి అమ్మకం ఉందని మధును నమ్మించారు. కొండపోచమ్మ ప్రాజెక్టు వద్ద మధుతో కలిసి నిందితులందరూ మద్యం తాగారు. రాత్రి మధును హత్యచేసి, శవాన్ని తాళ్లతో రాళ్లు కట్టి కొండపోచమ్మ సాగర్‌లో పడేశారు. నలుగురు నిందితులను అరెస్ట్ చేసి వారి నుంచి రూ.లక్ష నగదు, నాలుగు సెల్‌ఫోన్‌లు, బ్రిజా కారు, బైక్, ఖాళీ మద్యం సీసాలు స్వాధీనం చేసుకుని జ్యుడీషియల్ రిమాండ్‌కు తరలించినట్లు సీపీ తెలిపారు. పరారీలో ఉన్న మరో నిందితుడు బూర్ల ఈశ్వర్‌రావును త్వరలోనే పట్టుకుంటామన్నారు. కేసును ఛేదించిన గజ్వేల్ ఏసీపీ రమేశ్, రూరల్ సీఐ రాజశేఖర్‌రెడ్డి, ఎస్‌ఐ రంగకృష్ణ, పోలీసు సిబ్బందిని సీపీ అభినందించారు. వీరికి త్వరలో రివార్డులు అందజేస్తామన్నారు.